21న జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో ఈ నెల 21 నుంచి 23వ తేదీలలో ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కన్ను, చెవి, ముక్కు, గొంతు, మానసిక జబ్బులకు వైద్య బృందంతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వైద్య పరీక్షల్లో అర్హత ఉన్నవారికి వైకల్యం నిర్ధారిస్తూ ధ్రువీకరణ ధ్రువపత్రాలను నిర్దేశించిన వ్యవధిలోగా జారీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు పైన కనబరిచిన తేదీలలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెస్ కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ ప్రసాదరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మాంజలిదేవి

నిధుల లేమి..పనులు ఆగి!!

- నత్తనడకన పాల కేంద్ర భవన నిర్మాణాలు
- 219లో 6 మాత్రమే పూర్తి
- వివిధ దశల్లో మరికొన్ని భవనాలు

చీమల చెరువు పల్లెలో నత్తనడకన సాగుతున్న పాలకేంద్ర భవనం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అన్ని రకాల సేవలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో పాల కేంద్రాలు మంజూరు చేసింది. వాటికి సంబంధించిన నిర్మాణ పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. నిధుల లేమి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో, కొన్నిచోట్ల స్థలాల సేకరణ, కోర్టు, పలు కారణాల వల్ల పాల కేంద్రాలు భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో 219 పాల కేంద్ర భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 6 భవనాలు మాత్రమే పూర్తి చేశారు. 77 భవనాలకు కనీసం పునాదులు కూడా తీయలేదు. పాల కేంద్ర నిర్మాణ పనుల బాధ్యతను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారు. 2022వ సంవత్సరంలో ఒక్కో భవన నిర్మాణానికి రూ.15.73 లక్షల చొప్పున జిల్లాలో 219 భవనాలను మంజూరు చేశారు. తరువాత టెండర్లు పిలిచి నిర్మాణ పనుల ప్రారంభించారు. జిల్లాలో 77 చోట్ల భూవివాదాలు, కోర్టు, కాంట్రాక్టు ముందుకు రాక పోవడం వంటి కారణాలతో పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 45 గ్రామ పాల కేంద్రాలు మంజూరయ్యాయి. మట్టి తీసినవి 3, పునాదులు 0, గోడలు 2, స్లాబ్ 0, పూతల 0, పూర్తయినవి 2, మదనపల్లి నియోజకవర్గంలో 135 మంజూరు కాగా , మొదలు పెట్టినవి 67,వ ఎట్టి తీసినవి 5, పునాదుల 17, గోడల 1, స్లాబ్ 0, పూతలు 1, పీలేరు నియోజకవర్గంలో 20 మంజూరు కాగా ఒక్క భవనానికి మాత్రమే పునాదులు తీశారు. రాయచోటి నియోజకవర్గంలో 19 మంజూరు కాగా, మొదలు పెట్టినవి 2, పునాదులు 1, గోడలు 1, స్లాబ్లు3, పూర్తయినవి మూడు మాత్రమే ఉన్నాయి. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఒక్కటి కూడా మంజూరు కాలేదు,. మిగిలినవి వివిధ దశలలో నిలిచి పోయాయి. ఇప్పటివరకు 2 శాతం పూర్తయింది. మిగి లిన 98 శాతం పూర్తి కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని పలు వురు విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు చేసిన పనులకు కూడా సకాలంలో బిల్లు అందడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. 2024 సంవత్సరం చివరికి 100 శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం పేర్కొంటుంది. సకాలంలో ప్రజలకు పాల సేకరణ కేంద్రాలు భవనాలు పూర్తి స్థాయిలో అవుతాయో లేదో వేచిచూడాల్సిందే.

నిర్మాణ పనులు వేగవంతం చేస్తాం

జిల్లాలో పాల కేంద్రాలను భవన నిర్మాణ పనులను 2024 సంవత్సరానికి పూర్తి చేయడానికి వేగవంతం చేస్తున్నాం. మండల ఇంజినీర్లతో సమీక్షించి సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం బిల్లు సకాలంలో అందుతున్నాయి. వంద శాతం పాల కేంద్ర భవన నిర్మాణాలను పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుకున్నాం .

-ఎం.దయాకర్‌రెడ్డి, పిఆర్ఎస్ఇ, రాయచోటి.

పందిళ్లపల్లి బిపిఎం చేతివాటం

- రూ.6 లక్షల స్వాహా చేసినట్లు విచారణలో వెల్లడి
- విధుల నుంచి బిపిఎం గీత తొలగింపు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు సబ్ పోస్టాఫీస్ పరిధిలోని పందిళ్లపల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గీత వివిధ పథకాల కింద చిన్న మొత్తాల పొదుపు ద్వారా ఖాతాదారులు చెల్లించిన సొమ్మును చేతివాటం ప్రదర్శిస్తూ రూ.6 లక్షల వరకూ కాజేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని విచారణ అధికారి రాయచోటి సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌ఛార్జి కె.అమరనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా పందిళ్లపల్లి సబ్ పోస్టాఫీస్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించగా అక్కడ జరిగిన అవినీతి వెలుగులోకి వచ్చిందన్నారు. ఖాతాదారుల వద్ద సొమ్మును వసూళ్లు చేసిన బిపిఎం గీత పోస్టాఫీస్‌లో మాత్రం ఆ సొమ్మును జమ చేయకుండా కాజేసినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. వెంటనే ఆమెను విధుల నుండి తొలగించి విచారణ ముమ్మరం చేసినట్లు వారు స్పష్టం చేశారు. గ్రామంలోని చాలామంది ఖాతాదారులు తమ ఖాతా పుస్తకాలను బిపిఎం గీత వద్దనే ఉంచడం, నగదు చెల్లింపులు జరిగినప్పుడు ఖాతాదారుల పుస్తకాల్లో నమోదు చేయకపోవడం, ఎలాంటి సీల్ గానీ, ముద్రించకపోవడం వంటి చర్యలతో ఖాతాదారుల సొమ్మును అవలీలగా కాజేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఇంకా విచారణ జరుగుతున్నందున పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితురాలిపై చట్టపరమైన చర్యలు తీలుకోవడం జరుగుతుందన్నారు. అవసరమైతే ఖాతాదారుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదుచేసి స్వాహా అయిన సొమ్మును రికవరీ చేస్తామన్నారు.బాధితులు చెల్లించిన సొమ్ముకు రశీదు వుంటే తమను సంప్రదిస్తే తప్పకుండా రికవరీ చేయిస్తామన్నారు. ప్రజలు తపాలా శాఖపై ఎంతో నమ్మకంతో కూలీ, నాలీ చేసుకుని, వృద్ధులు, వితంతువులు చిన్నతరహా ఉద్యోగస్తులు ఆర్‌డి, ఆర్‌పిఎల్ఐటి, డిఎస్ఎస్‌వి, మహిళ సమ్మన్ యోజన తదితర పొదుపు పథకాల్లో పొదుపు నిమిత్తం చెల్లించిన సొమ్మును అక్రమంగా అన్యాయంగా బిపిఎం గీత కాజేయడం పట్ల ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తపాలా శాఖ ఉన్నత అధికారులు బ్రాంచ్ ఆఫీస్ కార్యాలయంలో జరిగిన లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, జరిగిన అవినీతిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం జరిగేలా చూడాలని ఖాతాదారులు కోరుతున్నారు.

బిపిఎం గీతపై విచారణ చేస్తున్న సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌ఛార్జి అమర్‌నాథ్

రజకులను కించపరిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి రాయచోటి

కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని జిల్లా రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు తిప్పాయపల్లి రమేష్ బాబు, వీరబల్లి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం వారు రాయచోటి పట్టణంలోని బోస్ నగర్ లో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ బెంగళూరులో ఒక మహిళా నాయకులు రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే రజకులను కించపరిచే విధంగా మాట్లాడితే ఊరుకోమన్నారు.బెంగళూరులో రజకులను కించపరిచే విధంగా మాట్లాడిన మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జిల్లా కన్వీనర్ల కో-ఆర్డినేటర్‌గా 'పంజం'

పీలేరు: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డికి అదనంగా అన్నమయ్య జిల్లా కన్వీనర్ల కో-ఆర్డినేటర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోధిషావలి శనివారం పీలేరు నుంచి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌గా జిల్లాలోని రైతులు, ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులకు చేరువ చేస్తున్న అతని కృషిని గుర్తించిన ఈ పదవి ఇచ్చిందన్నారు.

ప్రవీణ్ పాదయాత్రకు టిడిపి నేతల సంఘీభావం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ ప్రొద్దుటూరు నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శనివారం రాజంపేటకు చేరింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు, టిడిపి సీనియర్ నేత, రాజు విద్యా సంస్థల అధినేత జగన్మోహన్‌రాజు, మేడ విజయ శేఖర్‌రెడ్డితో పాటు మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రవీణ్‌కు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. అనంతరం ప్రవీణ్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొని కొంత దూరం నడిచి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు కడిగిన ముత్యం లాంటివాడని త్వరలోనే జైలు నుంచి బయటకు వస్తారని, అందుకోసం ప్రవీణ్ ప్రొద్దుటూరు నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేపట్టారని తెలిపారు. చంద్రబాబు బయటికి వస్తే జగన్‌కి రాజకీయ సమాధి కడతారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఇఒ, జడ్‌పిటిసి

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : ఎంఇఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉపాధ్యాయ వృత్తి కోటి జన్మల పుణ్యఫలమని మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండ్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న అడ్డగంటి సోమశేఖర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనందుకు ఎంపీటీసీ నాగ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ చౌడవరం నరసింహ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అవ్వడం గర్వకారణమని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ చౌడవరం నరసింహ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిని గౌరవించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తులను కాజేయాలని చూస్తున్నారు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మరణించిన మా తల్లిదండ్రుల పేరుతో బోగస్ వీలు నామ సృష్టించి కొందరు తమ ఆస్తులను కాజేసేందుకు చూస్తున్నారని బాధితుడు జన్నే నరసింహులు శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాపోయాడు. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 205,206/2,206/3,314/2,304/4 లను తమ నాన్నగారైన దీన్నే రామయ్యకి చెందినవని తెలిపారు. అయితే తమ ఆస్తులను తమ తల్లిదండ్రులు ఎవరికి ఎలాంటి విక్రయాలు జరపలేదని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి తమ ఆధీనంలోనే కలదని అన్నారు. అయితే ఈ భూమిని జే రామయ్య, అను పేరు గల వ్యక్తి అతని భార్య జె.రామలక్ష్మి, కొడుకు జె.రమేష్, కూతురు పద్మావతి, అనువారు నకిలీ పత్రాలు సృష్టించి జర్నీ రామయ్య చనిపోయిన వ్యక్తి పేరుతో భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్టర్ కార్యాలయం నందు సమర్పించారన్నారు. కొంతమంది ఇతరులతో కలిసి భూమిని కాజాయాలని చూస్తున్నారని, ఈ భూములకు సంబంధించి మదనపల్లి కోర్టు నందు బాగా పరిష్కారం కోసం కేసు నడుస్తోందని కూడా తెలిపారు. సమావేశంలో జె.నారాయణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే కాపు నేస్తం లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఫయాజ్‌బాషా

ప్రజాశక్తి-రాయచోటి

మహిళల ఆర్థిక ప్రగతే కాపు నేస్తం లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా అన్నారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా నిడిదవోలు బహిరంగ సభ నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా వైఎస్ఆర్ కాపు నేస్తం 4వ విడత లబ్ది సాయం మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి సందప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. జిల్లాలోని 10,596 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలోకి రూ.15.89 కోట్లను జమచేశారు. ఈ సందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు.మహిళలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్లు సొంతంగా నిలబడుకోవాలనే మంచి ఆలోచనతో వైయస్సార్ కాపు నేస్తం పథకానికి శ్రీకారం చుట్టి ప్రతి ఏడాది 15 వేల రూపాయలు మహిళల ఖాతాలలో జమ చేయడం జరుగుతోందన్నారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల పేద మహిళల జీవనోపాధి అవకాశాలు, వారి ప్రమాణాలు మెరుగు పరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కాపు సామాజిక వర్గములోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులములకు చెందిన 45 నుండి 60 ఏళ్ళ మధ్య వయస్సున్న పేద కాపు అక్క చెల్లమ్మలకు జీవనోపాధి అవకాశాలు, వారి జీవన ప్రమాణాలు పెంచే దిశగా 'వైఎస్ఆర్ కాపు నేస్తం పథకాన్ని 4వ ఏడాది ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా అర్హులైన బలిజ కాపు సామాజిక వర్గ మహిళలు 100 శాతం లబ్ది పొందుతున్నారన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు జీవనోపాధితో పాటు వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగు పడుతున్నాయన్నారు. అర్హత ఉండి లబ్ది చేకూరడంలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత సచివాలయాలలో గానీ లేదా సంబంధిత శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో గానీ నేరుగా కలిసి తెలుపవచ్చన్నారు. ప్రభుత్వ ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబరు:1902కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ, మెప్మా, డిఆర్‌డిఎ అధికారులు, సంబంధిత సంక్షేమ శాఖాధి కారులు, లబ్దిదారులయిన బలిజ, కాపు, ఒంటరి మహిళలు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు.

660 జిఒను రద్దు చేయాలి : ఎపి రైతు సంఘం

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రం

ప్రజాశక్తి-రాయచోటి

పంటల బీమాపై ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 660ని వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిరిపురం రామచంద్ర అన్నారు. శనివారం కొత్తపేటలోని సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023-24 పంటల బీమాలో ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశం నిలిపివేయాలన్నారు. ప్రభుత్వమే పంటల బీమా అమలు చేయాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా అమలుకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందిన్నారు. 2020 నుండి 2023 వరకు మూడు సంవత్సరాల పంటల బీమా అమలు అనుభవం పరిశీలిస్తే ప్రభుత్వం నేరుగా పంటల బీమా అమలు చేసిన 2020-21లో రూ.1700 కోట్లు, 2021-22లో రూ.2,900 కోట్లు రైతులకు పంటల బీమా రూపంలో ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. 2022-23లో ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు జరిగిన పంటల బీమా పథకం వలన రైతులకు కేవలం రూ.1100 కోట్లు మాత్రమే బీమా పరిహారం వచ్చిందని తెలిపారు. పంటల బీమా పథకం ప్రభుత్వమే తన బాధ్యతగా అమలు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పాలసీ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కొరకే తప్ప రైతుల ప్రయోజనం కొరకు కాదన్నారు. కనుక ప్రధాన మంత్రి ఫసల్ బీమా అమలు నిలిపివేయాలని పేర్కొన్నారు. 2022-23 సంవత్సరంలో పంటల నష్టపోయినా పంటల బీమా అమలు కాని రైతులు అందరికీ పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ఓటర్ల జాబితాపై చర్యలు చేపట్టాలి : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిజమైన ఓటర్లను తొలగించాలని ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి శనివారం ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో సుమారు 9400 మంది నిజమైన ఓటర్లను చనిపోయారనే నెపంతోనూ, ఊరు విడిచి వెళ్లారని, వివిధ రకరకాల కారణాలు చూపిస్తూ అన్యాయంగా, అక్రమంగా ఓట్లు తొలగించాలంటూ తప్పుడు ఫిర్యాదులు చేశారని, ఇది చాలా దారుణమని ఆర్‌డిఒ దృష్టికి తీసుకు రావడం జరిగిందని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, తాము కూడా తమ వారితో విచారణ చేపడుతున్నామని చెప్పడం జరిగింది. ముఖ్యంగా ఒంటిమిట్ట మండల ఉపాధ్యక్షులు బతికే ఉండగా ఆమె చనిపోయినట్లు, నందలూరు మండల ఉపాధ్యక్షులు భార్య చనిపోయినట్లు, నందలూరు మండల వైసిపి నాయకులు ఆరుముగం విశ్వనాథ్ భార్య చనిపోయినట్లు, రాజంపేట, సుండుపల్లి, వీరబల్లి మండలాల్లోనూ తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేశారని ఆర్‌డిఒ దృష్టికి తెచ్చామన్నారు. గుండ్లూరు పంచాయతీలో ఒక పోలింగ్ కేంద్రం బూతులో 130 మంది చనిపోయినట్లుగా తప్పుడు ఫిర్యాదులు చేశారన్నారు. స్పందించిన ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తప్పకుండా ఈ తప్పుడు ఫిర్యాదులపై విచారణ చేపట్టి పకడ్బందీగా ఓటర్ లిస్టు తయారు చేస్తామని ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మందరం గంగిరెడ్డి, ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారావు, ముమ్మడి మదన్మోహన్ రెడ్డి, పోలి మురళి రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆరుమగం విశ్వనాధ్, వడ్డే శ్రీను, మురళి ఆచారి, రమేష్ నాయుడు, కుందా నెల్లూర్ వెంకటేశ్వర్ రెడ్డి, సత్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

బంధువులకు మృతదేహాలు అప్పగింత

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు-కలకడ జాతీయ రహదారిలోని కెవి పల్లి మండలం మఠంపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను బంధువులకు శనివారం అప్పగించారు. ఈ ఘటనలో మరాఠా కుటుంబానికి చెందిన డ్రైవర్ హనుమంతు సిద్దోలు జాదవ్ (30) మృతి చెందాడు. 9 నెలల క్రితం వివాహమైన అతని భార్యకు వైవిధ్యం తప్పలేదు. ఇదే ప్రమాదంలో లింగాయత సమాజానికి చెందిన ఓ రైతు కుటుంబంలో అజూరు హనుమంతు(40), అజూరు మనంద (36) దంపతులు, అజూరు శోభ (36), అజూరు అంబిక (14) తల్లీ కూతుళ్ళు మృత్యువు పాలయ్యారు. అదే కుటుంబానికి చెందిన అజూరు కస్తూరి, అజూరు మేఘ, అజూరు శివానంద, అజూరు మునియప్ప, అజూరు మల్లప్ప, అజూరు అక్షిత, అజూరు ఉదయ్, అజూరు సునంద, అజూరు మహేష్, అజూరు సాక్షి, అజూరు బసవరాజ్ గాయాల పాలయ్యారు. మృతుల బంధువులు శుక్రవారం అర్ధరాత్రి పీలేరుకు చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు శవ పరీక్షలు నిర్వహించి, శనివారం మధ్యాహ్నం బెళగావి నుంచి వచ్చిన మృతుల బంధువులకు మృతదేహాలను, వారి వస్తువులను అప్పగించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన 11 మంది కుటుంబ సభ్యుల్లో అజూరు కస్తూరి, అజూరు శేఖర్, అజూరు మేఘ, అజూరు బసవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బంధువులు బెంగళూరుకు తరలించారు.



9 నెలల కిందట వివాహమైన డ్రైవర్ హనుమంతు దంపతులు (ఫైల్‌ఫొటో)

మూడు నెలల వ్యవధిలో రెండు ప్రమాదాలు: పీలేరు పరిసరాల్లో ఈ ఏడాది జూన్ మొదటి వారం నుంచి సెప్టెంబర్ రెండవ వారంలోగా రెండు తుఫాను వాహనాలు ఘోర ప్రమాదాలకు గురయ్యాయి. జూన్ 3న స్థానిక ఎంజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆగి ఉన్న లారీని తుఫాను వాహనం వేగంగా వెళ్లి ఢీకొన్న ఘటనలో తమిళనాడులోని తిరువన్నామలై యాత్రకు బయలుదేరిన భక్తుల్లో నంద్యాల జిల్లాకు చెందిన నలుగురు భక్తులు మృతి చెందగా 8 మంది గాయపడ్డారు. సరిగ్గా 103 రోజులకు శుక్రవారం ఉదయం మఠంపల్లి దగ్గర మరో తుఫాను వాహనం వేగంగా వెళ్లి ఎదురుగా వచ్చిన లారీని ఢీ కొన్న ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా 11 మంది గాయాలపాలైన మరో ఘటన చోటు చేసుకుంది. ఈ రెండు ఘటనలు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపైనే చోటు చేసుకోవడం గమనార్హం.

ప్రత్యామ్నాయమే!

ప్రజా'దృష్టి'

చి'వరి'కి ప్రత్యామ్నాయమే శరణ్యమని తేలిపోయింది. శుక్రవారం కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్లలో నిర్వహించిన జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ఖరీఫ్ కథ కంచికి చేరింది. పొరుగు రాష్ట్రమైన కర్నాటకలోని తుంగభద్ర, రాష్ట్రంలోని శ్రీశైలం రిజర్వాయర్లకు వరదలు రాలేదని, సదరు జలాశ యాల్లో ఆశించిన మేర నీటి నిల్వలు పెరగకపోవడంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేయడానికి అవకాశం లేకపోవడంతో సాగునీటిని విడుదల చేయడం లేదని సమీక్షా సమావేశాలు తేల్చాయి. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని వర్షాభావం పరిస్థితులను ఏకరువు పెట్టడానికే సమావేశం పరిమితం కావడం ఆందోళన కలిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మండలాల్లో కరువు తాండవం చేస్తోంది. ఈ మేరకు పలు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత తక్కువ వర్షపాతం కలిగిన అన్నమయ్య, కడప జిల్లాల్లో కరువు మండలాల గురించి మాట మాత్రంగానైనా ప్రస్తావన చేయకపోడం విస్మయాన్ని కలిగించింది. వ్యవసాయ సలహాదారులు హాజరైన సమావేశాల్లో కరువు మండలాల గురించి ప్రస్తావన లేకపోవడం తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఒకవైపు ఎపి రైతు సంఘం జిల్లా లోని కరువు పీడిత మండలాల్లో పర్యటిస్తూ కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తోంది. ఇటువంటి కరువు పీడిత డిమాండ్లను కూడా పట్టించుకునే స్పృహలో లేకపోవడం ఆందోళన కరం. ఇటువంటి తీవ్ర కరువు పీడిత పరిస్థితుల్లో నిర్వహించిన సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో సలహాదారులుగా ఉన్న నాయకులకు కరువు మండలాలు గురించి పట్టకపోవడం గమనార్హం. జిల్లా వ్యవ సాయశాఖ, సిపిఓ వంటి అధికారులైన సమావేశాల దృష్టికి తేవాల్సి ఉంది. సలహాదారులు కరువు మండలాల విషయంపై చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొని ఉంటే బాగుండేది. జిల్లా రైతాంగానికి కూడా కొంత ఉపశమనం కలిగి ఉండేది. ఎటువంటి కనీస ప్రయత్నం చేయకుండా మొక్కుబడిగా సమీక్షా సమావేశాలను నిర్వహించడం దేనికనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. కేవలం ప్రత్యామ్నాయ పంటల సాగు పరిస్థితుల్ని గురించి ప్రస్తావించడా నికైతే ప్రకటన జారీ చేస్తే సరిపోయే దానికి జిల్లా సాగునీటి సలహా, వ్యవసాయశాఖ సలహా మండలి సమావేశాల పేరుతో జిల్లాలోని ఉన్నతాధికారులు, సలహాదారులు హడావుడిగా ఒకచోట సమావేశమై స్పష్టమైన నిర్ణయాల్ని తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగించింది.

-ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కెవికెను పరిశీలిస్తున్న పాలక మండలి సభ్యులు

రైతులు నూతన పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి

ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు శనివారం డాక్టర్ ఎం.మల్లికార్జునరెడ్డి, బి.శ్రీనివాసులురెడ్డి కలికిరి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు తెలియజేసి వారు ఆ నూతన పద్ధతులు పాటించేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని తెలిపారు. రైతులకు అందిస్తున్నటువంటి సేవలు బాగున్నాయని ప్రశంసించారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ జివిఎస్ పాండు రంగా శాస్త్రవేత్తలతో కలిసి కెవికె లోని ప్రదర్శన క్షేత్రాలైన గుమ్మడికాయ, గొర్రెల పెంపకం, వర్మీ కంపోస్టు, నర్సరీలో పెంచుతున్నటువంటి మామిడి అంటు మొక్కలు, మునగ, చీని మొక్కలు, అజోల్లా పెంపకం, వేరు శనగ, అటవీ పంటలను, సమాచార కేంద్రాన్ని, భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించి శాస్త్రవేత్తలకు సూచనలు ఇచ్చారు. హరిజన ఉపప్రణాళికలో భాగంగా రైతులకు బ్యాటరీ పిచికారి యంత్రాలు పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బండపల్లి దగ్గర ఉండే ప్రేమాలయంలో వృద్ధులకు తిరుపతికి చెందిన రిటైర్డ్ ఎస్‌బిఐ క్యాషియర్ అనంత శయనం ఆర్థిక సాయంతో బెడ్ షీట్లు పంపిణీ చేసినట్లు వృద్ధాశ్రమ అధ్యక్షులు లయన్ పివిఎస్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం దాత మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో చలికాలం రాబోతున్న సందర్భంగా వృద్ధులకు చలి లేకుండా చేయాలనే ఉద్దేశంతో బెడ్‌షీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బండపల్లి ప్రేమాలయంలో బెడ్ షీట్లు అందించడం చాలా సంతోషించ దగ్గ విషయమని 40 సంవత్సరాల ముందు రిటైర్డ్ అయిన ఇంకా గుర్తు పెట్టుకుని ఇక్కడికి వచ్చినందుకు లయన్ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పాము కాటుతో గొర్రెల కాపరికి అస్వస్థత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గొర్రెలు కాయడానికి వెళ్లిన కాపరికి పాము కాటేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శనివారం పెద్దమండెం మండలంలో వెలుగు చూసింది. బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముసలికుంట పంచాయతీ దబ్బ నాయక్ తండాకు చెందిన మూడే దేవేంద్రనాయక్ రోజు మాదిరిగానే పొలానికి గొర్రెలను తోలుకొని మేత మేపించడానికి వెళ్లాడని చెప్పారు. అక్కడ చెట్ల మధ్యన ఉన్న విషసర్పం దేవేంద్రనాయక్ కాలిపై కాటేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని చెప్పారు. స్థానికులు గమనించి బాధితున్ని వెంటనే పెద్దమండెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని అన్నారు. ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నట్లు తెలిపారు.

టిడిపి, జనసేనలతో ఒరిగిందేమిలేదు

ప్రజాశక్తి-రామాపురం

టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోటీ చేసినా ఒరిగిందేమీ లేదని వైసిపిని గెలుపును అడ్డుకోలేరని మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో విజయానికి నాంది అవుతాయన్నారు. చంద్రబాబు నాయుడు జైలుకు పంపడం వైసిపి కుట్రలేదని అవినీతి పాల్పడంతో చట్టం తమ పని తాము చేసుకొని పోతుందన్నారు. జనసేన, టిడిపిలు ఎన్ని కుట్రలు చేసినా వైసిపి ప్రభంజన్ని ఆపలేవన్నారు. నవరత్నాల పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలం కాక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాంత్‌రెడ్డిని మరల గెలిపించి సిఎం జగన్‌ను మరల ముఖ్యమంత్రి చేయాలని కోరారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చారిత్రాత్మక, ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి ఆధ్వర్యంలో ఆకేపాడు గ్రామానికి చెందిన వీరం రెడ్డి చంగల్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివారెడ్డి, శకుంతల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కులతో భాగంగా 108 ప్రదక్షిణలు భక్తిశ్రద్ధలతో తిరిగారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, అరిగెల తేజ, నరసింహా, భక్తులు పాల్గొన్నారు.

ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని అంబేద్కర్ కూడలి వద్ద శనివారం ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అభిషేక్‌రెడ్డి మండలంలోని స్వచ్ఛంద సంస్థలు హెల్ప్ లైన్ సొసైటీ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలపల్లి గ్రామానికి చెందిన ముద్ద అభిషేక్ రెడ్డి దేశ రక్షణ కోసం సేవలో ఉన్నత స్థాయిని పొందడం ఆనందదాయకమన్నారు. ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమా మహేశ్వరి, మానవత సభ్యులు చౌడవరం సురేంద్ర రెడ్డి, మానవత అధ్యక్షులు ప్రతి శసాయిరాం, కార్యదర్శి ముని రావు, సిహెచ్‌ఎస్ సభ్యులు గాలి ఇంతి యాజ్, నరసింహులు నాయుడు, గా శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, అవినాష్, సాయి కృష్ణహరి ప్రసాద్, రియాజ్ భాషా పాల్గొన్నారు.

మహారాజ శ్రీ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.No : 679/2022 in O.S.No. 97/2018

షేక్ అక్తరున్నిసా బేగం భర్త లేట్ షేక్ మస్తాన్ బాషా డోర్ నెంబర్ 4/194, ఐస్నార్ వీధి, నందలూరు.

...పిటీషనర్/వాది

వర్సెస్

1. షేక్ చాంద్ బాషా died his legal heir Respondent No 2
2. షేక్ ముంతాజ్ బేగం భర్త లేట్ చాంద్ బాషా, బిసి కాలనీ హస్తల్ ఎదురుగా, పేటభాగ వీధి, నందలూరు.
3. షేక్ అమీర్ బాషా, తండ్రి లేట్ మహబూబ్ సాహెబ్, డోర్ నెంబర్ 4/184-1, నీలిపల్లె రోడ్, నందలూరు పోస్ట్.
4. షేక్ గౌస్ బాషా, తండ్రి లేట్ మహబూబ్ సాహెబ్, గౌతం స్కూల్ ఎదురుగా, నీలిపల్లె రోడ్, నందలూరు పోస్ట్.

...1 to 4 రెస్పాండెంట్స్

నోటీసు

పిటిషనర్, 1 నుండి 4 రెస్పాండెంట్స్ మీద దావా పెద్దొల్ దాఖలా అర్జీని 4 భాగములు చేయవలెనని కోయినచి రీ నియమించి 4 వాటాలుగా పెద్దొల్ దాఖలా అర్జీని విభజించుటకు ఫైనల్ డిక్రీ పాస్ చేయవలెనని కోర్టు వారికి పిటీషన్ పెట్టుకున్నారు. కావున రెస్పాండెంట్స్ 2 to 4 లకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 29.09.2023 తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మనవి చేసుకొనవలె లేనిచో పరోక్షముగ తీర్మానించబడును.

//పై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఏ.వి సుబ్రహ్మణ్యం

అడ్వకేట్, నందలూరు.

సెల్- 9440129650.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని వత్తలూరు గ్రామ పంచాయతీలోని దేవసముద్రం గ్రామంలో శనివారం సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో అందించిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. పేదల ఆర్థిక సామర్థ్యాలను పెంచాయని తెలిపారు. సంక్షేమ సాయంతో వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఉపయోగ కలిగినట్లు తెలిపారు. నాడు-నేడు కింద పాఠశాలల సమూల మార్పులు, ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో తిరిగి సిఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరారు. ఫించన్లకు అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలను గుర్తించి అందిస్తున్నామని చెప్పారు.

గడప గడపకూ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్‌ముస్తాక్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, రామనాథం, విజయ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి, శంకరయ్య, తహశీల్దార్ నరసింహ కుమాం, ఎంపిడిఒ రఘురాం, ఎస్ఐ రఘురాం, సచివాలయ అధికారులు, మండల అధికారులు వాలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

పుల్లంపేట : మానవహారంలో విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఓజోన్ పొర పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని బెసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనంద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఓజోన్‌డేని ఘనంగా నిర్వహిం చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఆనంద్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాసులు, ఐక్యూయేసి కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీదేవి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిఎస్ శైలజ, యుజిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొన్నారు. **మిట్స్‌లో..** అంగళ్ళు సమీపంలోని మిట్స్ లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీ. రామనాథన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఓజోన్ దినోత్సవం లేదా ఓజోన్ పొర పరిరక్షణ కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని సెప్టెంబర్ 16న జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమం లో కెమిస్ట్రీ విభాగాధిపతి రంజితభాస్కరన్, ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు. **నందలూరు :** అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కో-ఆర్డినేటర్ పి.రవిశంకర్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వ్యాస రచన, డ్రాయింగ్, వకృత్వ పోటీలలో ముగ్గురు విద్యార్థులు బహుమతులను గెలుచుకొని తమ సత్తా చాటారని గొబ్బిళ్ళ అక్షర స్కూల్ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్ , కరెస్పాండంట్ గొబ్బిళ్ళ శ్రీనాథ్‌లు అన్నారు. కార్యక్రమంలో వరప్రసాద్ , అమర్నాథ్, కుసుమ, జ్యోతి, పాల్గొన్నారు. **రాయచోటి :** మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్ ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే అవగాహన ర్యాలీ పాఠశాల మైదానం నుండి ప్రారంభమై కడప- చిత్తూరు జాతీయ రహదారి గుండా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, పూజారి రామయ్య, నబీ సాహెబ్, రెడ్డి శేఖర్, విజయ సారధి రెడ్డి, మహబూబ్ బాషా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **డైట్‌కళాశాలలో..** ఓజోన్ సమస్త జీవకోటికి రక్షణ కవచంలా ఉంటుందని జిల్లా జూనియర్ సివిల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి కె.శారద అన్నారు.పిల్లలకు వారి ప్రధాన హక్కులను, విధులను గూర్చి తెలియచేసారు. పిల్లలకు ఏమైన సమస్యలు వస్తే వారు న్యాయం కోసం ఎటువంటి అంశాలకు ఎవరిని సంప్రదించాలి అనే విషయాలు తెలిపారుజ సమావేశంలో ఓజోన్ పరిరక్షణకు సంబంధించి విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. **చిట్వేలి :** స్థానిక చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మావతి పాఠశాల మైదానంలో విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డిఐజి మునిస్వామి ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరిస్తూ, పరిశ్రమల ద్వారా, వాహనాల ద్వారా, ప్లాస్టిక్ వాడటం వలన, చెట్లు నరికి వేయడం వలన ఇలా అనేక రకాల కారణాలచే కాలుష్యం ఎక్కువైందని పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంతియాజ్ అహ్మద్, బొంతల శివనాగేశ్వరరావు, గాలాశివారెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కందుల నరసింహనాయుడు, వరుణ్ కుమార్‌రాజు, మొహమ్మద్ షఫీ , మరియు పద్మావతి పాఠశాల యాజమాన్యం బాబు సార్, పిఇటి నరసింహ, భాస్కర్, హరిత టీచర్ పాల్గొన్నారు. **గాలివీడు:** భూమిపై జీవరాశి ఉండడానికి ఏకైక కారణమైన ఓజోన్ పొర మనపై ప్రభావం రానికుండా అడ్డుపడుతున్నదని దాన్ని తగ్గించుకునే దానికి ఓజోన్ దినోత్సవం జరుపుకోవడం ప్రత్యేకత అని బాలికల ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు ఫైరోస్ ప్రమీల పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరాజు ఆధ్వర్యంలో ఓజోన్ గుర్తు చేయడానికి విద్యార్థినిలు అందరిని కూర్చోబెట్టి మానవహారం నిర్వహించారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట జడ్‌పిఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అతినీల లోహిత కిరణాల బారి నుండి ముప్పు తప్పుతుందని, జీవరాసులు మనుగడ సాధించాలంటే ఓజోన్ కొరకు హాని కలిగించే కారకాలను నివారించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలని విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రాజయ్య, ఇంద్రావతి, సురేంద్ర, సుకన్య, మల్లికార్జున, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, కిషోర్, ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి ప్రభుత్వ పాఠశాలలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎంపిక కాబడినటువంటి త్రోబాల్, కబడ్డీ, ఖో ఖో, యోగ క్రీడాంశ ములలో అండర్-14 , అండర్-17 సంవత్సరాల బాలబాలికలకు నియోజకవర్గస్థాయి ఎంపిక పోటీలు ఘనంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.శారద, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయమ్మ, చదివే వాండ్లపల్లి ప్రధానోపా ధ్యాయులు సంపత్‌కుమార్, ఎంఇఒ కరిముల్లా ప్రారంభించారు. నియోజవర్గంలో 430 మంది బాలబాలికలు ఈ క్రీడలందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటలను తమ జీవితంలోని దైనందిక కార్యక్రమంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆటల ద్వారా ఆరోగ్యాన్ని పొందాలని తెలిపారు. ఈ క్రీడలలో ఎంపికై జట్లు జిల్లాస్థాయి క్రీడలకు పంపబడునని పాఠశాల పీడీ ఆర్మోగం, బాలికల పాఠశాల పీడీ రెడ్డిమోహన్, జిల్లా సంఘ అధ్యక్షులు రమేష్ బాబులు తెలిపారు. కార్యక్ర మంలో సిఆర్‌పి సురేష్, నియోజకవర్గంలోని పిఇటిలు, పీడీలు సంపూర్ణమ్మ, నారాయణరెడ్డి, ఉషారాణి, ముబారక్, రియాజ్, నరేంద్ర, ఆనంద్, ప్రదీప్, సహదేవ నాయక్, పురుషోత్తం, మురళి, గీత, ప్రసాద్, నియాజునిస, జావీద్ పాల్గొ న్నారు. **తంబళ్లపల్లి :** విద్యార్థులు చదువు తోపాటు ఆటలలోనూ వచ్చినప్పుడే మానసిక ఉల్లాసం పెరుగు తుందని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. 800 మీటర్లు, 600 మీటర్లు, 100 మీటర్లు అండర్-14 ,అండర్-17 బాలబాలికలకు పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీల కు ఎంపిక చేశారు కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, హెచ్‌ఎం మదన్మోహన్ పాల్గొన్నారు **బి.కొత్తకోట :** ఈనెల 12,13వ తేదీల్లో పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ సెలక్షన్లలో అండర్-14, అండర్-17 విభా గాల లో డాక్టర్‌బి.ఆర్.అంబేద్కర్ గురు కుల పాఠ శాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి నియో జకవ ర్గం స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, పీడీ జి.శివ రామిరెడ్డి, పిఇటి ఎ.శేఖర్ రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-17 వాలీబాల్‌కు ఐదుగురు, కబడ్డీకి ఇద్దరు, ఖోఖోకు ఇద్దరు, యోగ, లాంగ్ జంప్ పోటీలకు ఒక్కొక్కరు చొప్పున ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులనును ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయభాస్కర్

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం పేద ప్రజలకు వరం లాంటి కార్యక్రమమని ఆస్పత్రిఅభివృద్ధి కమిటీ చైర్మన్ విజయభాస్కర్ పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొనసాగుతోందన్నారు. పేద ప్రజల ఆరోగ్యం పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేక దృష్టి సారించి వైద్య బృందాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైద్య సదుపాయాల గురించి వివరించి, ప్రతి ఇంట్లో ఉన్నటువంటి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే వాటిని గుర్తిస్తున్నారని చెప్పారు. పేదలకు ఉన్నతమైన వైద్యసేవలు అందించేందుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి విశేషమైన కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి వైద్యం అందించడానికి అన్ని వసతులతో కూడిన ఆస్పత్రి భవనాన్ని మన లక్కిరెడ్డిపల్లెలో నిర్మింప చేయడం చాలా సంతోషకరమన్నారు. ప్రజలు కూడా నేషనల్ హెల్త్ కార్డ్‌ను పొంది రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాలను పొందాలన్నారు. డాక్టర్ ధరణి మాట్లాడుతూ ఆస్పత్రిలో మంచి అనుభవం కలిగిన డాక్టర్లు ఉన్నారని ప్రతి శనివారం చెవి, ముక్కు, గొంతు ,చిన్నపిల్లల, ఆరోగ్య సమస్యల పట్ల పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవాజ్, భరత్ కుమార్, నిస్సార్ అహ్మద్ జీవన్, హెడ్ నర్స్ రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, క్లర్క్ రెడ్డికృష్ణ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వత్తలూరు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన కీ.శే. జి.రామమోహన్ రాజు ఏడవ వర్ధంతి సందర్భంగా వారు కుమారులు పుల్లంపేట ఎంఇఒ, చక్రధర్‌రాజు, భానుమూర్తి రాజు, శశిధర్ రాజు పాఠశాల ఉపాధ్యాఉలను ఘనంగా సత్కరించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతితో పాటు మెమొంటోతో సత్కరించారు. పీడీ పార్థసారథి పీడీ, ఉపాధ్యా యులు వెంకటసుబ్బయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజంపేట ఎఇఒ సుబ్బరాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బరాజు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు చవితి వేడుకలు

పుల్లంపేట : మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులు పాఠశాలలో శనివారం గణపతి విగ్రహాలను మట్టితో తయారు చేయడం జరిగిందని ప్రిన్సిపల్ చందన్ బాబు తెలిపారు. మట్టితో విగ్రహాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కాలుష్యం నివారణ, విద్యార్థులలో సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని పిల్లల్లో ఇలాంటి కార్యక్రమాలు సృజనాత్మకతను నెలకొల్పుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పెట్టి పూజించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, రవి, రాధ, సురేష్ , వాసు, సుధాకర్, రెహమాన్, సరళ, నాగలక్ష్మి, మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది. **రాజంపేట అర్బన్ :** పట్టణ కేంద్రంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలుగు ప్రజల సాంప్రదాయ పండు గల్లో వినాయక చవితి పండుగను మొదటి పండుగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్చార్జి కస్తూరి పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత

రైల్వేకోడూరు : మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన 30 మంది మహిళలకు శనివారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో రాష్ట్ర నైపుణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వారికి శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లను పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అనంతరం జిల్లా అధికారి హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఈ స్కిల్ హబ్ లను ఏర్పాటు చేసిందన్నారు. రైల్వే కోడూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమేష్, బుడుగుంటపల్లి సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, శిక్షకులు పార్థసారధి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సునీల్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నిరుపేదలకు అండగా ఉంటాం :'చింతల'

ప్రజాశక్తి-కలకడ

నిరుపేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి నిలిచారని అన్నారు. రాష్ట్రంలో దారిద్య రేఖకు దిగువుగా ఉన్న వారిని గుర్తించి వారికి పింఛన్లు అందజేస్తూ అండగా నిలిచిన ముఖ్యమంత్రిగా ప్రతిష్టలు సంపాదించారన్నారు. ఫించన్లకు అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలను గుర్తించి వారందరికీ ఫించన్లను మంజూరు చేశామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కులం, మతం, బేధం, రాజకీయపార్టీ చూడకుండా అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలు పొందుతున్నారని చెప్పారు. ఇంకా అర్హత కలిగి సంక్షేమ పథకాలు రాని వారు స్థానిక గ్రామ సచివాలయాలలో కలిసి పొందవచ్చని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరల వైసిపిని ఆదరించి మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మండలంలో నూతనంగా 325 పింఛన్ల మంజూరు కాగా వారికి రూ.919100లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మండలపార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి సింగల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి , కలికిరి మార్కెటింగ్‌యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు,నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

ప్రజాశక్తి-నందలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ ఆరోగ్యం అందుతుందని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ సభ భవనంలో శనివారం మండల పరిషత్ అధ్యక్షులు అధ్యక్షతన మండల వైద్య అధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం జగనన్న సురక్ష బ్రోచర్స్, షెడ్యూల్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, నడివీధి సుధాకర్, సీనియర్ బిసి నాయకులు హిమగిరినాథ్ యాదవ్, ఎఎన్ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మేడపై నుంచి కింద పడి యువరైతు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మృతిచెందిన మల్లికార్జునరెడ్డి

వర్షం పడుతుండటంతో మేడపై నుంచి చకచకా దిగే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని మొరంపల్లికు చెందిన రెడ్డప్పరెడ్డి కుమారుడు యువరైతు బి.మల్లికార్జునరెడ్డి (32) శుక్రవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో మేడపై నుంచి మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకు న్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. బాధితున్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారని తెలిపారు. అక్కడి వైద్యసిబ్బంది మెరుగైన చికిత్స అందించినా కోలుకోక పోవడంతో శనివారం మృతి చెందాడని చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కుటుంబానికి ఆసరగా ఉన్న యువరైతు మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై బికొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

రూ.50 కోసం స్నేహితుడిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గాయపడిన బాధితుడు ముస్తఫా

అప్పుగా తీసుకున్న రూ.50 కోసం స్నేహితుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సిటిఎంకు చెందిన నాగరాజు మద్యం తాగేం దుకు మూడు రోజుల క్రితం అదే వీధిలో నివాసమున్న తన స్నేహితుడు ముస్తఫా(40) వద్ద నుంచి యాభై రూపాయలు అప్పుగా తీసుకున్నాడని అన్నారు. తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదని సిటిఎం క్రాస్ రోడ్డులో ఇద్దరూ ఘర్షణకు దిగారని అన్నారు. మాట మాట పెరిగి నాగరాజు తన వద్ద ఉన్న కత్తితో ముస్తఫాను పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడని, బాధితున్ని స్థానికులు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడి వైద్యులు తక్షణమే చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినాయక చవితి సందర్భంగా మండపం పందిరి ఏర్పాటుకు కొబ్బరి మట్టలు కోసం చెట్టు ఎక్కి ప్రమదవశాత్తు కిందపడి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. మండలంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన కుమార్(30) గ్రామానికి సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలానికి వెళ్లి అక్కడ ఉన్న టెంకాయ చెట్టు ఎక్కి కొబ్బరి మట్టలు కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. స్థానికులు గుర్తించి జిల్లా ఆస్పత్రికి తరలించగా, అత్యవసర విభాగం వైద్యులు అతనికి మెరుగైన వైద్యం అందిం చిన ట్లు తెలిపారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆటోను ఢీకొన్న టెంపో

- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టెంపో వాహనం ఆటోను ఢీకొన్న సంఘటనలో తంబళ్లపల్లి, కురబలకోట, మదనపల్లి మండలాలకు చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. శనివారం మదనపల్లి మండలంలో చోటు చేసుకున్న ఘటనపై రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని కోళ్ల బైలు రోడ్డు పొన్నేటిపాలెం డంపింగ్ యార్డ్ వద్ద ఆటోను టెంపో ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటన సమాచారం అందుకున్న 108 సిబ్బంది సద్దాం, దివ్య వెంటనే వెళ్లి గాయపడ్డ వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారన్నారు. గాయపడ్డవారిలో తంబళ్లపల్లి మండలం, కన్నె మడుగుకు చెందిన నరసింహులు, కుమారుడు కార్తీక్‌కు కళ్ళల్లోకి అద్దాలు చొచ్చుకుపోయాయని అన్నారు. కురబలకోట మండలం గౌనివారిపల్లికి చెందిన తిమ్మక్క, మదనపల్లి మండలం కోళ్ల బైలు గ్రామం, మేకలవారిపల్లికి చెందిన శంకర, చౌడేపల్లి మండలం, కాగితికి చెందిన మారెప్పలు గాయపడ్డారని తెలిపారు. గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.